సాక్షి
ప్రకాశం

గురువారం | 28 | సెప్టెంబర్ | 2023



నిమజ్జనోత్సవంలో అపశ్రుతి

వినాయక నిమజ్జనంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృతిచెందిన ఘటన కురిచేడు మండలం పొట్లపాడులో చోటుచేసుకుంది.

- 8లో..



ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక

అండర్-19 బాలుర ఫుట్‌బాల్ జట్టును బుధవారం ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో ఎంపిక చేశారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35/28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు

ఒంగోలు: ఈద్ మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా ముస్లింలకు మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావులు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినమైన ఈద్ మిలాద్-ఉన్-నబీ పండుగ సమాజంలో శాంతి, సంతోషం పెంపొందించాలని, ప్రేమ, సౌభాతృత్వంతో కూడిన ఆయన జీవితాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఆప్షన్ 3 కింద లబ్ధిదారులకు జీఎన్‌ఆర్ నిర్మాణ సంస్థ ద్వారా నిర్మించి ఇస్తున్న ఇళ్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. మార్కాపురం, పొదిలిలో ఆప్షన్ 3 కింద జీఎన్‌ఆర్ సంస్థ నిర్మిస్తున్న 3465 ఇళ్ల నిర్మాణ పురోగతిని హౌసింగ్ పీడీ పేరయ్య కలెక్టర్‌కు వివరించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలన్నీ డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈఈలు పవన్, చెన్నారాయుడు, జీఎన్‌ఆర్ మేనేజింగ్ పార్టనర్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పాత ఈవీఎంలు పూణెకు తరలింపు



ఈవీఎంలు పూణెకు తరలిస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: స్థానిక భాగ్యనగర్‌లో ఈవీఎం గోదాములో ఉన్న 2019 అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను బుధవారం ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో మహారాష్ట్రలోని పూణెలోని బెల్ కంపెనీకి తరలించారు. ఉమ్మడి జిల్లాలోని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి, అద్దంకి, పర్చూరు, చీరాల, కందుకూరు నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించిన 10,256 బ్యాలెట్ యూనిట్‌లు, 7484 కంట్రోల్ యూనిట్‌లు, 17,739 ఈవీఎంలు పూణెకు తరలించారు. దీనిలో ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది ఉపేంద్ర, నవీన్, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషా బేగ్, రసూల్, గుర్రం సత్యం తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ జూనియర్ సివిల్ జడ్జిగా శివనాయక్



శివనాయక్

యర్రగొండపాలెం: పట్టణానికి చెందిన వి.శివనాయక్ తెలంగాణ స్టేట్ జ్యుడిషియల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆయన బీఏఎల్‌ఎల్‌బీలో ఉస్మానియా యూనివర్శిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి మాస్టర్ ఇన్ లా పూర్తి చేశారు. వాషింగ్టన్ డీసీ స్కూల్ ఆఫ్ ఐపీఆర్ యూనివర్శిటీ నుంచి 'పేటెంట్ లా' సర్టిఫికెషన్ కోర్స్ పూర్తి చేసిన ఆయన అక్టోబర్ 3వ తేదీ తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టనున్నారు. శివనాయక్ పూర్వీకులు తెలంగాణాలోని నాగర్ కర్నూల్ జిల్లా విప్లపల్లికి చెందిన వారు అయినా ఆయన తండ్రి హరినాయక్ ఉద్యోగరీత్యా యర్రగొండపాలెంలో విద్యుత్ శాఖ లైన్‌మెన్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. ప్రస్తుతం ఆయన గిద్దలూరులో ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్నారు. హరినాయక్ సోదరుడు వి.తిరుపతినాయక్ అడ్వొకేట్‌గా హైదరాబాదులో విధులు నిర్వహిస్తున్నారు.

2న టేబుల్ టెన్నిస్ క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న అండర్ 17, అండర్ 19 బాలబాలికలు, సీనియర్ క్రీడాజట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు స్థానిక ఎల్‌బీసీ కార్యాలయం ఎదురుగా ఉన్న అకాడమీలో రిపోర్టు చేయాలన్నారు. ఇందుకోసం తమ పేర్లను ముందుగా 8019762584 వాట్సాప్‌కు పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

పవర్ ఫుల్

జిల్లాలో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. కరెంటు కోతలు లేకుండా పగటి పూట రైతులకు నిరంతరం 9 గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా చేయటంలో విద్యుత్ శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. లోఓల్టేజీ సమస్య రాకుండా జిల్లాలో ఎక్కడికక్కడ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో ఇప్పటి వరకు రూ.407 కోట్ల వ్యయంతో ఉమ్మడి ప్రకాశంలో కరెంటు సమస్యలను పరిష్కరిస్తూ ఆధునిక సౌకర్యాలు కల్పించారు.

- జిల్లాలో కోతలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యంగా చర్యలు
- రూ.407 కోట్లతో ఆధునిక సదుపాయాలు
- నూతనంగా 32 సబ్‌స్టేషన్లు, 8 వేలకు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- ఒంగోలులో అండర్‌గ్రౌండ్ కేబుల్ లైన్ల ఏర్పాటు
- 7 డివిజన్‌లలో 12 మిలియన్ యూనిట్ల కరెంటు నిరంతర సరఫరా



చీమకుర్తి మండలం రామతీర్థంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్

చీమకుర్తి: ప్రజలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో లోఓల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు, విద్యుత్ లోడు పెరిగిన ప్రాంతాల్లో కలిపి గడిచిన నాలుగేళ్లలో దాదాపు 8 వేలకు పైగా నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను రూ.80 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. దాని ద్వారా లోఓల్టేజీ సమస్యే కాకుండా ఇతర ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

రూ.75 కోట్లతో 32 నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు

విద్యుత్ లోడును అధిగమించేందుకు జిల్లాలో 32 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌లను నిర్మించారు. ఒక్కో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.2.50 కోట్లు చొప్పున మొత్తం 32 సబ్‌స్టేషన్‌లను రూ.75 కోట్లతో నిర్మిస్తున్నారు. వాటిలో ఇప్పటి వరకు 26 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తికాగా మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.

రూ.148 కోట్లతో జగనన్న కాలనీలకు ఎలక్ట్రిఫికేషన్:

జిల్లాలోని రూరల్, అర్బన్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీల లేఅవుట్‌లలో రూ.148 కోట్ల వ్యయంతో ఎలక్ట్రిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న దాదాపు 18 వేల ఇళ్లకు నూతనంగా విద్యుత్ మీటర్లను అందజేయడంతో జగనన్న కాలనీల్లో విద్యుత్ కాంతులతో కొత్త శోభను సంతరించుకున్నాయి.

రూ.28 కోట్లతో కొత్తపట్నం ఇండస్ట్రియల్ కారిడార్ రీవ్యాంపింగ్:

కొత్తపట్నం ఇండస్ట్రియల్ కారిడార్‌లో రీవ్యాంపింగ్ పనులను రూ.28 కోట్లతో ఆధునీకరించారు. ఇండస్ట్రియల్ కారిడార్‌లో పారిశ్రామిక రంగానికి అనువుగా ఇప్పటి వరకు ఉన్న పాత కరెంటు స్తంభాలను తొలగించటం, పాత లైన్‌లు తీసేయటం, వాటి స్థానంలో నూతన స్తంభాలు, నూతన లైన్‌లను ఏర్పాటు చేశారు.

రూ.30 కోట్లతో పాతలైన్‌ల స్థానంలో నూతన లైన్‌ల ఏర్పాటు:

జిల్లాలో పాతబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న పాతలైన్‌లను తీసేయటం, వాటి స్థానంలో నూతన లైన్‌లు ఏర్పాటు చేయటం, పాత కరెంటు స్తంభాలను తీసేసి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. దానికి గాను జిల్లా మొత్తం మీద రూ.30 కోట్లు ఖర్చు చేశారు.

రూ.46 కోట్లతో అండర్ గ్రౌండ్ కేబుల్ సదుపాయం:

ఒంగోలులోని కర్నూల్‌రోడ్డులోని బస్టాండ్ నుంచి రాజీవ్ నగర్ వరకు సౌత్ బైపాస్‌లో గతంలో ఉన్న 132 కేవీ స్థానంలో రూ.46 కోట్ల వ్యయంతో అండర్ గ్రౌండ్ కేబుల్‌ను ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విద్యుత్ శాఖామంత్రిగా ఉన్న సమయంలో మంజూరు చేయించి నిర్మించారు. దాని వలన గాలి వానలు ఏర్పడినప్పుడు కరెంట్ సరఫరాకు అంతరాయం కలగకుండా సురక్షితమైన కరెంటును సరఫరా చేయటానికి దోహదపడింది.

ఒంగోలులో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఖర్చు : రూ.46 కోట్లు		
జగనన్న కాలనీలకు ఎలక్ట్రిఫికేషన్‌కు రూ.148 కోట్లు	కొత్తపట్నం కోస్టల్ కారిడార్ అభివృద్ధికి రూ.28 కోట్లు	విద్యుత్ సబ్‌స్టేషన్లకు రూ.75 కోట్లు
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు: రూ.80 కోట్లు	నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు: రూ.30 కోట్లు	

రోజుకు 12 మిలియన్ యూనిట్ల కరెంటు సరఫరా:

జిల్లాలో రోజుకు 12 మిలియన్ యూనిట్లు కరెంటును అధికారులు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాను 7 డివిజన్‌లుగా విభజించారు. దర్శి, ఒంగోలు, అద్దంకి, చీరాల, కనిగిరి, కందుకూరు, మార్కాపురం డివిజన్‌లుగా విభజించారు. 7 డివిజన్‌లలో సరఫరా అయ్యే కరెంటును వ్యవసాయం, ఇండస్ట్రియల్, డొమెస్టిక్-కమర్షియల్ విభాగాలుగా విభజించారు. ఒక్కో విభాగానికి రోజుకు 4 మిలియన్ యూనిట్లు (40 లక్షల యూనిట్లు) కరెంటును సరఫరా చేస్తున్నారు.

వినియోగం పెరిగే కొద్దీ సరఫరా పెంపు:

నాలుగేళ్ల క్రితం జిల్లాకు 8 మిలియన్ యూనిట్ల కరెంటు డిమాండ్ ఉండేది. ఏడాదికి సరాసరిన ఒక మిలియన్ యూనిట్ వంతున వినియోగం పెరుగుతోంది. దానిలో భాగంగానే నాలుగేళ్ల క్రితం 8 మిలియన్ యూనిట్లుగా ఉండే కరెంటు నేడు 12 మిలియన్ యూనిట్లకు పెరిగింది. జిల్లాలో ఇప్పటి వరకు 25 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. వాటికి పగటి పూట నిరంతరం 9 గంటలకు తగ్గకుండా కరెంటును సరఫరా చేయటంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందిస్తున్నారు.



అండర్ గ్రౌండ్ కేబుల్ సబ్‌స్టేషన్



జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

> **దాదాపు రూ.407 కోట్లతో జిల్లాలో కరెంటు సరఫరాకు చర్యలు**
>
> జిల్లాలోని ప్రజలకు, రైతులకు, ఇండస్ట్రియల్, కమర్షియల్, డొమెస్టిక్ రంగాలతో పాటు ప్రత్యేకంగా ఇటీవల నిర్మించిన జగనన్న కాలనీలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దానిలో భాగంగా గత నాలుగేళ్లలో రూ.407 కోట్ల వ్యయంతో 8 వేల ట్రాన్స్‌ఫార్మర్‌లు, 32 విద్యుత్ సబ్‌స్టేషన్‌లను నిర్మించాం. రూ.148 కోట్లతో జగనన్న కాలనీలకు ఎలక్ట్రిఫికేషన్, 28 కోట్లతో కొత్తపట్నం ఇండస్ట్రియల్ క్యారిడార్ రీవ్యాంపింగ్ పనులు చేశాం. రోజుకు 12 మిలియన్ యూనిట్లు కరెంటు సరఫరా చేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు మెయింటెనెన్స్, లైన్లు మార్చే సమయంలో తప్ప కరెంటు కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం.
>
> – కేవీజీ సత్యనారాయణ, ఎస్‌ఈ, ఒంగోలు

స్పందన సమస్యలను పరిష్కరిస్తా



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

● కలెక్టర్ దినేష్‌కుమార్

సింగరాయకొండ: మండలంలోని దేవదాయ శాఖ భూముల సమస్య పరిష్కారానికి ఒక కమిటీని వేసి నివేదికను ప్రభుత్వానికి అందజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక గంజి కళ్యాణ మండపంలో బుధవారం 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో 263 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో ప్రధానంగా మండలంలోని పాత సింగరాయకొండ, సోమరాజుపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 1,300 ఎకరాల్లో ఎన్నో ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉండటమే కాక పొలాలు సాగు చేసుకుంటున్నామని, మా స్థలాలపై హక్కు కల్పించాలని ప్రజలు కోరారని, పంచాయతీరాజ్, సర్వే, దేవదాయ శాఖ అధికారులతో ప్రత్యేక కమిటీ వేస్తానన్నారు. ఏపీఐఐసీ లేఅవుట్‌లో స్థలం కేటాయించాలని వడ్రంగి కార్మికులు చేసిన విజ్ఞప్తిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. మండలంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలు పరిష్కరించటానికి జెడ్పీ నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 5 స్పందన కార్యక్రమాలు నిర్వహించామని, త్వరలో అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ మండల స్థాయిలోనే జిల్లా అధికారులందరూ పాల్గొనటంతో పాటు కలెక్టర్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపటం హర్షించదగ్గ పరిణామమన్నారు. అంతకు ముందు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి వరికూటి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ సర్పంచ్ తాటిపర్తి వనజ మాట్లాడుతూ పంచాయతీలో రెగ్యులర్ సెక్రటరీ లేక అభివృద్ధి కుంటుపడుతోందని, సెక్రటరీని నియమించాలని కోరారు. బింగినపల్లి, కరేడు మత్స్యకార పాలెంల మధ్య మన్నేరు లో చేపల వేట సాగించటం పై వివాదం ఉందని, ఆ వివాదం పరిష్కరించాలని మత్స్యకారులు కోరారు. కార్యక్రమంలో భాగంగా నలుగురు పారిశుధ్య కార్మికులను కలెక్టర్ దినేష్‌కుమార్ పూలమాల వేసి సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ కలెక్టరుకు పుష్పగుచ్ఛం అందజేశారు. డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, నాదరముని, ఉమాదేవి, గ్లోరియా, చీఫ్ ప్లానింగ్ అధికారి డీ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ కే మాధురి, స్పందన సూపరింటెండెంట్‌లు డీ నాగజ్యోతి, డీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ షేక్ మర్దనాలి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండయ్య, డ్వామా పీడీ శీనారెడ్డి , అగ్రికల్చర్ జేడీ శ్రీనివాసరావు, తహశీల్దార్ సీహెచ్ ఉష, ఎంపీడీవో షేక్ జమీఉల్లా, ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ సామంతుల రవి కుమార్‌రెడ్డి, సీఐ దాచేపల్లి రంగనాథ్, జీ శ్రీహరి రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బి జట్ల ఎంపిక

కొనకనమిట్ల: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జూనియర్ బాల, బాలికల జిల్లా జట్లను బుధవారం ఎంపిక చేశారు. కొనకనమిట్ల మండలం వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో జట్ల ఎంపిక నిర్వహించారు. రగ్బీ క్రీడలో జిల్లాలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి పాల్గొన్న క్రీడాకారుల్లో మంచి ప్రతిభ కనబరిచిన బాల, బాలికలను రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ముందుగా క్రీడా పోటీలను వెలిగొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర రావు ప్రారంభించారు. జిల్లా కోచ్ ఎస్.హసాన్ పర్యవేక్షణలో ఎంపిక సెలక్షన్ కమిటీ సభ్యులుగా గొట్లగట్టు, బొద్దికూరపాడు, తాడివారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల పీడీలు ఎం.బాలగురవయ్య, ఎస్ రవిప్రసాద్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, అర్ధవీడు, చెన్నారెడ్డిపల్లి పాఠశాల పీఈటీలు పెద్దన్న, అచ్చయ్యలు వ్యవహరించారు. అక్టోబర్ నెల 1, 2 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా జట్లు పాల్గొంటాయని అన్నారు.

ఎంపికైన బాలుర జట్టు:

రాష్ట్రస్థాయిలో ఎంపికైన బాలుర జట్టులో జి.కుమార్ శివరామకృష్ణ, డి.బ్రహ్మతేజ, ఎస్‌కే.హుసేన్ బాష, కె.నందకిషోర్ (బొద్దికూరపాడు జెడ్పీ పాఠశాల), జె.ఇజ్రాయిల్, ఎల్.జాన్‌పాల్, ఎం.నాగచైతన్య, పి.షద్రక్(వెలుగొండ గురుకుల పాఠశాల), ఎం.అభి, కె.షద్రక్ (అర్ధవీడు గురుకుల పాఠశాల), పి.కార్తీక్, సీహెచ్.మణికంఠ, యువి.ఆకాష్ రెడ్డి (చెన్నారెడ్డి జెడ్పీ పాఠశాల), స్టాండ్ బైగా పి.హేమంత్ (బొద్దికూరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల), పి.సాంబశివ (గొట్లగట్టు జెడ్పీ పాఠశాల) విద్యార్థులు ఎంపికయ్యారు.

బాలికల జట్టు:

బాలికల జట్టులో కె.కీర్తి, పి.పూజిత, కె.శౌప్రియ (చెన్నారెడ్డిపల్లి), ఏ.కీర్తన, ఎం.నాగమణి, పి.కోమలి(బొద్దికూరపాడు), జి.సాక్షి, డి.ప్రవళిక, కె.పవిత్ర, డి.మేరి (కంభం), కె.నరసమ్మ (గొట్లగట్టు) పాఠశాల బాలికలు ఎంపికయ్యారు. వీరందరినీ జిల్లా కోచ్ హసాన్, పీడీ, పీఈటీలు ప్రత్యేకంగా అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలుర జట్టు



బాలికల జట్టు

రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

● వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ స్టేట్ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న యాదాల అశోక్‌బాబు

మద్దిపాడు: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. మండలంలోని దొడ్డవరం గ్రామంలో ఆరోగ్యశాఖ సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న తీరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ఏర్పాటు చేసి పలువురికి ప్రాణ దానం చేస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారని, ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం చేకూరాలని ఆయన ఆశిస్తున్నారని అన్నారు. సర్వే నిర్వహించే సమయంలో ఇంటిలోని వారికి పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్య శాఖ సిబ్బందికి సూచించారు. ప్రతి వ్యక్తికి అవసరమైన పరీక్షలు నిర్వహించి వారికి టోకెన్ అందించాలని అన్నారు. అనంతరం గ్రామస్తులు పలువురితో మాట్లడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో పరీక్షలు చేయించుకుని వారు గ్రామాల్లో ఏర్పాటు చేసే మెడికల్ క్యాంపులకు వస్తే జబ్బు తీవ్రతను బట్టి వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా వైద్యం చేయించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. అనంతరం వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా క్యాన్సర్‌కు చికిత్స తీసుకుని స్వాంతన పొందిన రోగిని పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట దొడ్డవరం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలం పోతవరం గ్రామంలోనూ ఓ క్యాన్సర్ పేషెంట్‌ను యాదాల అశోక్‌బాబు పరామర్శించారు.

పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను గుర్తించాలి

● జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత అన్నారు. స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యాటన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పర్యాటక అధికారి బెన్‌హర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత మాట్లాడుతూ ప్రపంచ పర్యాటన దినోత్సం ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులకు జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. స్టెప్ మేనేజర్ ఆర్‌పీ శ్రీమన్నారాయణ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆర్ లోకనాథం, నెహ్రూ యువకేంద్రం అధికారి కమల్ షా, హర్షిణి కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఆర్కిడ్ స్కూల్ కరస్పాండెంట్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు ప్రతిభా పురస్కారం



ప్రశంసపత్రం అందుకుంటున్న ఎం.ప్రసాద్

ఒంగోలు మెట్రో: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చర్ మిషన్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విజయవాడ బాలోత్సవ భవనంలో ఎగ్జిబిషన్, ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన 'సాక్షి' సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎం.ప్రసాద్‌కు ప్రతిభా పురస్కారాన్ని సీసీఎల్‌ఏ అడిషనల్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అందించారు.

పల్లెకు చేరిన పాలన


వేములకోట సచివాలయం


చినమనగుండం సచివాలయం, కొనకనమిట్ల మండలం

- పశ్చిమ ప్రకాశంలో 219 భవన నిర్మాణాల్లో 145 గ్రామ సచివాలయాలు పూర్తి
- ప్రజలకు ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- సచివాలయాల ద్వారా 534 రకాల సేవలు

మార్కాపురం: టీడీపీ చంద్రబాబు పాలనలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాడిలో పెట్టారు. టీడీపీ ప్రభుత్వంలో ఏ పథకం రావాలన్నా జన్మభూమి కమిటీ దయాదాక్షిణ్యాల మీద ఆధార పడాల్సిందే. ఊర్లో కొత్త పింఛన్ రావాలంటే ఎవరో ఒకరు చనిపోతేనే మంజూరుచేస్తారు. రేషన్ కార్డు కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్లు పట్టాల్సిందే.. ఇటువంటి పరిస్థితుల్లో పాలన గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో ప్రజల కష్టాలు తీరాయి. గతంలో ఏ సర్టిఫికెట్టు కావాలన్నా పనులు మానుకొని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సేవలన్నీ గ్రామ స్థాయిలో ప్రజలకు లభ్యమవుతున్నాయి. పల్లెల్లో అభివృద్ధి, సంక్షేమ విప్లవం జరుగుతోంది. ప్రజలకు తమ గ్రామంలో ఉండే సచివాలయాలలోనే ప్రభుత్వం అందించే 534 రకాల సేవలు లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం పల్లెల్లో పరిస్థితి ఎలా ఉందంటే అర్హులై ఉండి రేషన్‌కార్డు కావాలంటే సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే చాలు వెంటనే మంజూరు చేస్తున్నారు. లబ్ధిదారులు అర్హులై ఉండి ఇంటి పట్టా కావాలన్నా, ఆసరా పథకంలో డబ్బులు రావాలన్నా, అమ్మఒడి అందుకోవాలన్నా, అవ్వా తాతలకు పింఛన్ కావాలన్నా గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తున్నారు. ఇలా పల్లెల్లో అభివృద్ధి విప్లవంతో ముందుకు వెళుతుంది. గ్రామాభివృద్ధి సచివాలయాలు కీలకపాత్ర. దీంతో ప్రభుత్వం సచివాలయాలకు శాశ్వత భవన నిర్మాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలలో మొత్తం 219 సచివాలయాలు ఉండగా, 145 సచివాలయాలకు భవనాలు నిర్మాణాలు పూర్తికాగా మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.



విప్లవాత్మకమైన వ్యవస్థ

గ్రామ సచివాలయాల ఏర్పాటు చారిత్రాత్మకమైన నిర్ణయం. ప్రభుత్వ పాలన ప్రజల దగ్గరకు వచ్చింది. సచివాలయాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ఇది ప్రజల ఆస్తి, భవనాల నిర్మాణం కూడా త్వరగా పూర్తవుతున్నాయి. 534 రకాల సేవలను సచివాలయాల ద్వారా ప్రజలు పొందవచ్చు. వివిధ సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకు వెళ్లి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. సచివాలయ వ్యవస్థను ప్రజలు ఉపయోగించుకోవాలి.

– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే

మార్కాపురంలో ఇలా..

మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 65 సచివాలయాలు నిర్మిస్తున్నారు. ఒక్కో సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలను కేటాయించగా నియోజకవర్గం మొత్తానికి రూ.26 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇప్పటి వరకు 36 సచివాలయాల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలిన 29 సచివాలయాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. మార్కాపురం మండలంలో 20, తర్లుపాడులో 11, కొనకనమిట్లలో 18, పొదిలిలో 16 సచివాలయాలు ఉన్నాయి. మార్కాపురం మండలంలో 9, తర్లుపాడులో 4, కొనకనమిట్ల 13, పొదిలిలో 10 భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

సచివాలయాల ద్వారా సేవలు

సచివాలయాల ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఈబీసీ సర్టిఫికెట్లు, ఆరోగ్యశ్రీ కార్డు, జగనన్న చేదోడు, కాపునేస్తం, వాహనమిత్ర, వసతి దీవెన, విద్యాదీవెన, ఒంటరి మహిళ, దివ్యాంగుల, కిడ్నీ బాధితుల పింఛన్లు, నూతన పింఛన్లు, కరెంటు బిల్లుల చెల్లింపులు, విద్యుత్ మీటర్ల మంజూరు, రైతు భరోసా, ఇలా వివిధ రకాల సంక్షేమ పథకాలతో పాటు సుమారు 534 సేవలను ప్రజలకు అందిస్తున్నారు. అర్హులైన వారు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రజలు తమ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా సచివాలయానికి వెళితే వారికి అవసరమైన సర్టిఫికెట్లు ఇంటికే వస్తాయి..



ఇంటికి తెచ్చి సర్టిఫికెట్ ఇచ్చారు

కుల ధ్రువీకరణ పత్రానికి వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోగా సచివాలయంలో నమోదు చేయించారు. సర్టిఫికెట్ మంజూరైన తరువాత వలంటీర్లు మా ఇంటికి వచ్చి సర్టిఫికెట్‌ను అందచేశారు. చాలా సంతోషంగా ఉంది.

– ఎం. సరస్వతీ, మార్కాపురం



కౌలుకార్డు తీసుకున్నా

నా పేరు కోలగట్ల రామకృష్ణారెడ్డి, స్వగ్రామం తర్లుపాడు. గత కొన్నేళ్లుగా స్థానికంగా పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. కౌలు కార్డు ద్వారా ప్రయోజనాలు ఉంటాయని వలంటీర్ ద్వారా తెలుసుకుని పత్రాలతో సచివాలయంలో దరఖాస్తు చేశాను. అధికారులు పత్రాలు పరిశీలించి కౌలుకార్డును వెంటనే అందించారు. గతంలో కౌలు కార్డుకోసం వీఆర్‌ఓ, అగ్రికల్చర్ అధికారుల చుట్టూ 20 రోజుల పాటు తిరిగితే ఇచ్చేవారు. కానీ ఇప్పుడు వెంటనే మంజూరుచేశారు.

– కె.రామకృష్ణారెడ్డి, తర్లుపాడు

నిమజ్జనోత్సవంలో అపశ్రుతి


వినుకొండ ఆస్పత్రిలో ఉన్న మృతదేహాలు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేణుగోపాల్

- విద్యుదాఘాతానికి ఇద్దరు దుర్మరణం


తడకమల్ల నాగేంద్రం (ఫైల్)

కురిచేడు: మండలంలోని పొట్లపాడు గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. నిమజ్జన సమయంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి 9 రోజుల పాటు పూజలు చేశారు. మంగళవారం రాత్రి గ్రామోత్సవం చేసి నిమజ్జనం చేసేందుకు ఏర్పాటు చేశారు. ఒక ట్రాక్టర్ ట్రక్కులో గణపతి విగ్రహాన్ని ఉంచి లైటింగ్ ఏర్పాటు చేశారు. విగ్రహానికి నాలుగు వైపులా ఇనుప పైపులు ఉంచి డెకరేషన్ చేశారు. గ్రామోత్సవం అనంతరం పొలాల్లోని నీటి గుంటల్లో నిమజ్జనం చేసేందుకు పొలాల బాటలో వెళుతుండగా విద్యుత్ తీగలు డెకరేషన్ కోసం ఏర్పాటు చేసిన పైపులకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురవడంతో ట్రాక్టర్ పై ఉన్న వారంతా కిందకు దిగారు. ప్రమాదంలో చమిడిశెట్టి శ్రీను(35), తడకమల్ల నాగేంద్రం (11) విద్యుదాఘాతానికి గురై స్పృహ తప్పడంతో వెంటనే వినుకొండలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హాస్పిటల్‌లో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు శ్రీనుకు భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. నాగేంద్రం 8వ తరగతి చదువుతున్నాడు. వీరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యం దేవకుమార్ తెలిపారు.


విద్యుత్ షాక్ తగిలిన తీగెలను పరిశీలిస్తున్న విద్యుత్ ఏఈ

అన్ని విధాలా అండగా ఉంటాం

పొట్లపాడులో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. పార్టీలో చురుకైన పాత్రను శ్రీను పోషించాడని, ఒక కార్యకర్తను పోగొట్టుకోవటం బాధాకరమన్నారు. వారి కుటుంబసభ్యులకు అండగా ఉండి శ్రీను లేని లోటును తీర్చుతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట రాష్ట్ర గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ షేక్.సైదా, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కండె గంగయ్య, దర్శి ఏఎంసీ మాజీ అధ్యక్షుడు వైవీ సుబ్బయ్య, కురిచేడు సొసైటీ ప్రెసిడెంట్ పోతిరెడ్డి నాగిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కాకర్ల కాశయ్య, నాయకులు ఉన్నారు.

ఒంగోలు నగరపాలక సంస్థ, ఒంగోలు

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్

నెం.749/2023-24 నుండి 867/2023-24 వరకు, తేది.27.09.2023

			టెండర్ నోటీస్ నెం. 749/2023-24 నుండి 764/2023-24 వరకు	టెండర్ నోటీస్ నెం. 765/2023-24 నుండి 867/2023-24 వరకు
1.	మొత్తం పనుల సంఖ్య	:	16	103
2.	మొత్తం పనుల అంచనా విలువ	:	రు.142.50 లక్షలు	రు.2009.22 లక్షలు
3.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండర్ షెడ్యూల్ లభ్యమగు ప్రారంభ తేది	:	28.09.2023 సాయంత్రం 4 గం.నుండి	30.09.2023 సాయంత్రం 4 గం.నుండి
4.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండర్ షెడ్యూల్ లభ్యమగు చివరి తేది	:	05.10.2023 సాయంత్రం 4 గం.వరకు	16.10.2023 సాయంత్రం 4 గం.వరకు
5.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో ఆన్‌లైన్ ద్వారా బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయము	:	05.10.2023 సాయంత్రం 4.15 గం.ల వరకు	16.10.2023 సాయంత్రం 4.15 గం.ల వరకు
6.	టెక్నికల్ బిడ్ తెరుచుటకు నిర్ణయించిన తేది మరియు సమయము			16.10.2023 సాయంత్రం 4.30 గం.లకు
7.	ప్రైస్ బిడ్ తెరుచుటకు నిర్ణయించిన తేది మరియు సమయము	:	05.10.2023 సాయంత్రం 4.30 గం.లకు	16.10.2023 సాయంత్రం 4.45 గం.లకు

ఇతర వివరములకు సంప్రదించవలసిన చిరునామా www.apeprocurement.gov.in వివరములకు : 98499 06599

కమీషనర్, ఒంగోలు నగరపాలక సంస్థ

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు డి.నెం.37-1-407/12, 1వంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టంగా" పరిగణించబడును) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన [illegible]

తేది: 25-09-2023
ప్రదేశం: పామూరు

సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

యూనియన్ బ్యాంక్ Union Bank

టంగుటూరు-2 బ్రాంచి

కొండెపి రోడ్డు, టంగుటూరు, ప్రకాశం జిల్లా-523274
ఫోన్: 08592 - 242999
E-Mail:ubin0809837@unionbankofindia.bank

[illegible]

ఫుట్‌బాల్ బాలుర క్రీడా జట్టు ఎంపిక


అండర్ 19 ఫుట్‌బాల్ క్రీడాజట్టు

ఒంగోలు: అండర్ 19 బాలుర ఫుట్‌బాల్ జిల్లా క్రీడాజట్టు ఎంపిక స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో బుధవారం జరిగింది. ఎంపిక ప్రక్రియను ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు, ఎస్‌జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి ఆదినారాయణరావు, ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్‌రాజులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ ఉంటుందన్నారు. అత్యంత ఎక్కువ మంది ప్రేక్షకులు కలిగిన ఫుట్‌బాల్ క్రీడా ఆడే సమయంలో ఏకాగ్రత, గెలవాలనే కసితో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు అత్యంత అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. స్థానిక ఏబీఎం కాలేజీలో ఫుట్‌బాల్ ఆట ఆడిన అనేకమంది మంచి మంచి స్థానాలలో నేడు ఉన్నారని, కనుక ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో కూడా రాణించాలని సూచించారు.

క్రీడాజట్టు వివరాలు:

పి.సంతోష్, డి.సూర్య, వైవీ హిమశేఖర్, జె.మైఖేల్, కె.ఇమ్మానుయేల్, వై.బాదుల్లా, ఎన్.జోయెల్, జి.రామారావు, జీవీ నాగ తేజ, బబ్లు, డి.లివింగ్ స్టోన్, కె.మోక్షజ్ఞ, ఆర్.సంతోష్, ఎస్‌కె రిజ్వానా, బి.రామ్‌నిఖిల్, టి.పవన్, ఎం.మధుబాబు, కె.రాకేష్‌తో పాటు స్టాండ్‌బైలుగా వి.హేమంత్, ఎస్.సాయి భార్గవ్, డి.బమనోహర్.

వ్యక్తి అనుమానాస్పద మృతి

సింగరాయకొండ: వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం మండలంలోని పాకల పంచాయతీ ఒకటో నెంబర్ ఉప్పు కొఠారు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం కుంట గ్రామానికి చెందిన మున్నా(35) కంకర స్లాబ్ పని నిమిత్తం పామూరుకు చెందిన బత్తుల విజయకుమార్ వద్దకు వచ్చాడు. మూడు రోజుల క్రితం కందుకూరు వచ్చిన మున్నాకు మంగళవారం రాత్రి ఫిట్స్ రావటంతో గది నుంచి బయటకు వెళ్లిపోయాడు. తరువాత అతని కోసం విజయకుమార్ వెతికినా ప్రయోజనం లేకపోయింది. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఉప్పు కొఠారుల వద్ద మున్నా కనిపిస్తున్నాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. తరువాత 12.30 గంటల సమయంలో ఉప్పు కొఠారులలో చనిపోయి పడి ఉన్నాడని అతని ఒంటిపై ఎటువంటి గాయాలు లేవని, అనారోగ్య కారణాలా లేదా ఇతర కారణాల వలన మృతి చెందాడా అని నిర్ధారించాల్సి ఉందని గ్రామ వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై టి శ్రీరామ్ తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): మండలంలోని కె.పల్లెపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జేసీ శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. సర్వే నంబర్ 2146లో 15 ఎకరాలు కేటాయించగా..ఆ స్థలాన్ని రీ సర్వే చేయాలని తహసీల్దార్ బీవీ రమణారావును ఆదేశించారు. కొలతలు కొలిచి మ్యాప్ వెంటనే ఇవ్వాలన్నారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.375 కోట్లు మంజూరయ్యాయని, మెటీరియల్ ధరలు పెరిగినందున రూ.400 కోట్లకు పెంచే అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఫిషింగ్ ఏడీ ఉషాకిరణ్, ఎఫ్‌డీఓ ఆషా, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పామూరు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 96 టెట్రాప్యాక్‌ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కనిగిరి సెబ్ సీఐ షేక్.అబ్దుల్‌జలీల్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం వస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పామూరు సమీపంలోని 565 జాతీయ రహదారి జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఓ ట్రావెల్స్‌బస్‌లో నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం కుమ్మరపాలెం గ్రామానికి చెందిన ముప్పాళ్ల విజయ్ అక్రమంగా కర్నాటక మద్యం తీసుకువస్తుండగా 96 టెట్రా ప్యాక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఎస్సై రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యంతో సెబ్ సీఐ, ఎస్సై

హుండీ ఆదాయం రూ.22.60 లక్షలు


హుండీలోని నగదు లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవదాయ శాఖాధికారులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయలో ప్రధాన హుండి ఆదాయం గత 3 నెలలకు మొత్తం రు.22,60,593 వచ్చినట్లు ఈఓ జి.రమణారెడ్డి తెలిపారు. నారాయణ స్వామి గర్భాలయం పక్కన బుధవారం దేవదాయ ధర్మాదాయ శాఖ కందుకూరు డివిజన్ పరిశీలకుడు జీఏ సత్యనారాయణ, ఆలయ ఈఓ జి.రమణారెడ్డి పర్యవేక్షణలో ప్రధాన హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత జూన్ 27వ తేదీ నుంచి 27వ తేదీ సెప్టెంబర్ వరకు 3 నెలలకు హుండీ లెక్కించినట్లు తెలిపారు. దీనిలో ప్రధాన హుండీ ద్వారా రూ.22,40,612 కాగా, అన్నదాన హుండీ ద్వారా రూ.19,981 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జిలకర అంజనాదేవి, కొమ్మినేని వెంకటరావు, ముదుమాల నారాయణరెడ్డి, పాలపర్తి నారాయణరావు, అర్చకులు మంకాల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

1న బాలుర క్రీడా జట్టు ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబరు 1న ఉదయం 9 గంటలకు స్థానిక ఏసీఏ మినీ లార్ట్స్ గ్రౌండ్స్‌లో అండర్ 14 బాలుర క్రీడాజట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా అడ్‌హక్ కమిటీ జిల్లా కన్వీనర్ వీరరాఘవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు హాజరయ్యే వారు ఫారం 5 సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, తెల్లటి దుస్తులు, షూ ధరించి రావాలన్నారు. పూర్తి వివరాలకు 9246222999 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వివాహిత అదృశ్యం

కొండపి(సింగరాయకొండ): తన భార్య మాధవి మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని కొండపి గ్రామానికి చెందిన ఆమె భర్త కమలాకర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణయ్య పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో చీరాల మహిళ సత్తా

చీరాల రూరల్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2023న విడుదల చేసిన ఉద్యోగుల జాబితాలో చీరాలకు చెందిన కూరపాటి ప్రియ కీర్తన జాతీయ స్థాయిలో 33వ ర్యాంకు కైవసం చేసుకుని గ్రూప్–1 గెజిటెడ్ ర్యాంకు సాధించి (డీఎస్పీ హోదా) సీఐఎస్‌ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగం సాధించింది. చీరాల సంపత్ నగర్‌లో నివాసముంటూ ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తున్న కూరపాటి సాల్మన్, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న తెలగతోటి ఇందిర దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరి పెద్ద కుమార్తె కూరపాటి ప్రియ కీర్తన బీటెక్ కంప్యూటర్స్ పూర్తి చేసింది. 2022లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బోర్డు నిర్వహించిన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్ పరీక్షకు హాజరై పరీక్షలో ఉత్తీర్ణురాలయ్యింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో ఆల్ ఇండియా 33వ ర్యాంకు, స్త్రీలలో 3వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకు సాధించింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున చింతగుంట్ల గ్రామ సమీపంలో జరిగింది. మృతి చెందిన వ్యక్తి యాచకుడిగా పోలీసులు గుర్తించారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION
■ Anu Study Centre Courses, offered M.A (All Courses), M.Com, M.LiSC (1 year) B.A (All Courses), B.Com, B.B.A, B.LiSC (1 Year) AKVK Degree College, Ongole. ✆ 83310 41187, 83310 41188. [OA-118]

బ్యూటీ పార్లర్ శిక్షణ
■ హెలెన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ – ఒంగోలు నందు అక్టోబర్-2 నుండి 17 తేది వరకు (15రోజులు). రాపిడ్ బేసిక్ బ్యూటీ పార్లర్ కోర్సు (F) నేర్పించబడును, అతి తక్కువ ఫీజుతో, సం॥ ✆ 98488 33609, 89788 33609, బ్యూటీ పార్లర్ స్టాఫ్ (F) కావలెను. మంచి జీతం కలదు. [O-191626]

Real Estate

PLOTS FOR SALE
■ మేదరమెట్లలో 160ఎకరాల మెగా గేటెడ్ గజం 5900, హౌస్33లక్షలు, పొదిలిటౌన్‌లో సెంటు2.5 లక్షలు, అద్దంకి దగ్గర 100ఎ॥ 5సం॥ మొక్కలు 22సెంట్లు 96 శ్రీగంధం మొక్కలు 6.5లక్షలు✆9390451999 [O-191669]
■ 11సెంట్లు రూ.7.5లక్షలకే అగార్ ఉడ్ పై పెట్టుబడితో 8సం॥లలో 50లక్షల బై బ్యాక్ ఎగ్రిమెంట్‌తో రిజిస్ట్రేషన్, గుంటూరు జిల్లా, న్యూజెండ్ల మండలంలో. 9490517066 [G-255]

HOUSES FOR SALE
■ ఒంగోలు, కర్నూల్‌రోడ్, లింగారెడ్డి అపార్ట్‌మెంట్ రోడ్‌లో 160చ॥గ॥లో నూతనంగా నిర్మించిన పడమర ఫేసింగ్‌తో గల 3 ఇండిపెండెంట్ (2 BHK) ఇళ్ళు అమ్మబడును. సంప్ర॥ SSS హోమ్స్ ✆ 97039 98899, 75694 76242. [O-191627]

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2413]
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర ✆ 945 945 3338 [B-528]

Wanted
■ ఒంగోలులోని ప్రముఖ టాలెంట్ చెస్ అకాడమిలో చెస్‌కోచెస్‌గా పనిచేయుటకు చెస్ కోచెస్ కావలెను. వెంటనే సంప్ర॥ ✆ 94944 27319, 96667 25719. [O-191628]
■ మారుతి వ్యాన్ డ్రైవర్ (లైసెన్స్,Exp.గల) -1, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్-1మరియుపోస్టర్స్ ఫిక్సింగ్ కుర్రోల్లు కావలెను. ఒంగోలు లోకల్ నివాసం వారు సంప్ర॥ ✆ 9666047473, 9985708883 [O-191666]
■ మా సెక్యూరిటి సంస్థ నందు S.కొండ పరిసరాలలో పనిచేయుటకు సెక్యూరిటి గార్డులు కావలెను. మంచి జీతం + PF&ESI, రూం, భోజనం ఫ్రీ ✆ 7396611165, 8886676130. [O-191665]
■ ప్రకాశం జిల్లా టంగుటూరి మండలం దగ్గర ప్రముఖ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు కావలెను ఉచిత వసతి మరియు ఉచిత భోజనం కలదు. సంప్ర॥ 98489 77496, 92980 11777. [B-1206659]
■ సూళ్లూరుపేట ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను /10th/ఇంటర్/45 సం.లోపు జీతం 12,000 8 గంటల డ్యూటీ, EPF, ESI రూము, భోజన సదుపాయం కలదు. Ph: 7680849999, 8886664039 [T-4618]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9160900024 [HA-657]
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801116]
■ Required Computer Operator for logistics & Accountant for an Granite Exports Company (with SAP knowledge), with good communication Skills and must be fluent in English Cont. ✆ 88866 01001, Between 9.30 AM to 6.30 PM. (ongole.hr@sati.co.in) [O-191663]
■ Wanted Bank Field Verification Executives : Cumbum, Giddalur, Markapuram, Darsi, Contact: 7288803402, 7793910928. [NA-5909]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ : ఒంగోలు
90102 02856
90102 02762

తాజా వార్తల కోసం లాగానై అవ్వండి www.sakshi.com